జాతీయ రహదారికి మణిహారంలా..

జాతీయ రహదారికి మణిహారంలా గ్రీన్‌బెల్ట్ ప్రాంతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఒకప్పుడు పిచ్చి మొక్కలు, తుప్పలు, శిథిలమైన ఫెన్సింగ్, ఆక్రమణలతో మందు బాబుల అడ్డాలుగా ఉండే గ్రీన్ బెల్ట్‌లు ఇపుడు సరికొత్త అందాలతో ఆహ్లాదాన్ని, ఆరోగ్యానిచ్చే పార్కులుగా మారిపోయాయి. నియోజకవర్గ పరిధిలోని అక్కయ్యపాలెం హైవే జంక్షన్ అభివృద్ధికి ల్యాండ్‌మార్క్‌గా నిలిచింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు చొరవతో ఈ ప్రాంతాలు హరితవనాలను తలపిస్తున్నాయి.

- హరితవనాన్ని తలపిస్తున్న గ్రీన్‌బెల్ట్
- రూ.1.18 కోట్లతో అక్కయ్యపాలెం జంక్షన్ అభివృద్ధి
- నాలుగు పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, షటిల్ కోర్టులు


అక్కయ్యపాలెం హైవే కూడలి వద్ద గ్రీన్ బెల్ట్‌లో అభివృద్ధి చేసిన పార్కు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్


అక్కయ్యపాలెం కూడలిలో చూడముచ్చటగా జెండా పార్కు

సీతంపేట: గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో పచ్చదనం పరవళ్లు తొక్కుతోంది. ఆహ్లాదం.. ఆనందం..ఆరోగ్యానికి చిరునామాగా ఈ ప్రాంతాలను తీర్చిదిద్దారు. నియోజకవర్గంలో హైవేకు ఇరువైపులా ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి, రక్షణ కోసం కొత్తగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని అందమైన పార్కులుగా అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. పచ్చదనాన్ని పెంపొందించి సేదతీరే వారికి ఆహ్లాదాన్ని ఇచ్చేలా తీర్చిదిద్దారు. ఆరోగ్యానికి అవసరమైన వ్యాయామం చేసేందుకు ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌లు, షటిల్ కోర్టు, పిల్లల ఆట పరికరాలు ఏర్పాటు చేశారు.

కొత్తందాలతో పలకరిస్తూ..

స్మార్ట్ సిటీకి తగినట్లు నగరంలో పలు ప్రాంతాల అభివృద్ధి, బ్యూటిఫికేషన్ పనులు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు నగరంలోకి ప్రవేశించడానికి హైవేపై ప్రధాన కూడలి అయిన అక్కయ్యపాలెం జంక్షన్‌లో గ్రీన్‌బెల్ట్ ప్రాంతం బ్యూటిఫికేషన్‌తో ప్రత్యేకంగా ఆకట్టుకోవడంతో పాటు అభివృద్ధికి ల్యాండ్ మార్కుగా నిలుస్తోంది. హైవేపై అక్కయ్యపాలెం కూడలి వద్ద పార్కు ప్రత్యేక సెల్ఫీ పాయింట్‌గా మారింది. అలాగే ప్రయాణికుల కోసం నిర్మించిన అక్కయ్యపాలెం (సౌత్, నార్త్) స్మార్ట్ బస్ స్టాప్‌లు ఈ ప్రాంతానికి కొత్త అందాన్ని తెచ్చాయి. సౌత్ బస్టాప్ వెనుక ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు చొరవతో బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారు. గ్రీన్ బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్ , ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. దీనికి తోడు సౌత్ బస్టాప్ వెనుక గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో పిల్లలు ఆడుకోవడానికి రూ..19.90 లక్షలతో చిల్డ్రన్ ప్లే ఏరియా అభివృద్ధి చేస్తున్నారు. పిల్లలు ఆడుకోవడానికి స్లైడర్లు, లేడర్లు ఏర్పాటు చేశారు. అలాగే మరికొంత భాగంలో షటిల్ కోర్టు నిర్మిస్తున్నారు. గోడలపై అందమైన ఆర్ట్ వేశారు. అలాగే గ్రీన్‌బెల్ట్‌లో షాదీఖానా రోడ్ సమీపంలో రూ.19.80 లక్షలతో వాకింగ్ ట్రాక్, మధ్యలో ఫ్లవర్ గార్డెన్, బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేయడానికి పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి పనులతో హైవేపై అక్కయ్యపాలెం కూడలికి కొత్త అందాలతో పలకరిస్తోంది.

అక్కయ్యపాలెం గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో అభివృద్ధి ఇలా..	
అక్కయ్యపాలెం సౌత్ బస్టాప్ రూ.26.90 లక్షలు	అక్కయ్యపాలెం నార్త్ బస్టాప్ రూ. 26.90 లక్షలు
గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్, పార్కు రూ. 15 లక్షలు	సౌత్ బస్టాప్ వెనుక చిల్డ్రన్ ప్లే ఏరియా రూ. 19.90 లక్షలు
జెండా పార్కు రూ. 10 లక్షలు	బుద్ధా గార్డెన్ రూ. 19.80 లక్షలు


అక్కయ్యపాలెం సౌత్ బస్టాప్ వెనుక గ్రీన్ బెల్ట్‌లోని ప్లే ఏరియాలో ఏర్పాటు చేసిన ఆట పరికరాలు

ఆహ్లాదాన్నిచ్చే పార్కులుగా...



ఒకప్పుడు గ్రీన్ బెల్ట్ అస్తవ్యస్తంగా ఉండేది. అక్కయ్యపాలెం హైవే కూడలిని బాగా అభివృద్ధి చేశారు. స్మార్ట్ బస్‌షెల్టర్లు, గ్రీన్‌బెల్ట్‌లో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్, షటిల్ కోర్టు, గ్రీనరీ అభివృద్ధి చేశారు. గ్రీన్ బెల్ట్ అందంగా మారిపోయింది.

–దుర్గారావు, అక్కయ్యపాలెం

ఓపెన్ జిమ్ ఎంతో ఉపయోగకరం



కరోనా తర్వాత ప్రతీ ఒక్కరికి ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. వ్యాయామం కోసం జిమ్‌లకు వెళ్లాలంటే చాలా ఖర్చుతో కూడిన పని. అక్కయ్యపాలెం ప్రజలకు ఖర్చు లేకుండా వ్యాయామం చేసుకునేలా గ్రీన్‌బెల్ట్‌ను ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌లు, సేద తీరడానికి ఆహ్లాదాన్నిచ్చే పార్కులుగా అభివృద్ధి చేశారు.

–శంకరరావు, అక్కయ్యపాలెం

క్లుప్తంగా

రోల్‌బాల్ క్రీడకు విశేష ఆదరణ


రోల్‌బాల్ క్రీడాకారిణిని సత్కరిస్తున్న రాజు రఘునాథ్ దబాడే, సుబ్రహ్మణ్యం

మురళీనగర్: రోల్‌బాల్ క్రీడకు రాష్ట్ర స్థాయిలో విశేష ఆదరణ ఉందని రోల్‌బాల్ వ్యవస్థాపకుడు రాజు రఘునాథ్ దబాడే అన్నారు. విశాఖ రోల్‌బాల్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశాఖ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయి రోల్‌బాల్ విజేతలను రాజు రఘునాథ్‌తో పాటు సౌత్ ఇండియా కార్యదర్శి ఎం.పి సుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు. రోల్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు జి.ప్రతాప్, కార్యదర్శి ఎ.అనిల్ కుమార్ రెడ్డి, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు ససపల వరప్రసాద్, కార్యదర్శి పీవీ సూర్యనారాయణ, విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి తోట లలిత ప్రియ, కోచ్ పూసర్ల సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలో నూతన 132 కేవీ హెచ్‌టీ టవర్ నిర్మాణం, కండక్టర్ మార్పుల కారణంగా 19వ తేదీ మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ జోన్–1 ఈఈ బి. సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈటర్న్ స్టాప్, గండి బాబ్జీ కార్యాలయ ప్రాంతం, గ్రీన్‌పార్క్ ఏరియా, వినాయక గుడి ప్రాంతాల్లో ఉదయం 8 నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ లైన్‌మన్ మృతి

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో 11కేవి విద్యుత్ ఫీడర్ నిర్వహణ ప్రక్రియలో విధులు నిర్వహిస్తూ కింద పడిపోయిన ఒక లైన్‌మన్, చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ ప్రాంతానికి చెందిన సయ్యద్ అలీ(35) అనే లైన్‌మన్ గత నెల 24న కంచరపాలెం, ధర్మానగర్ వద్ద 11 కేవీ ఫీడర్ విద్యుత్ నిర్వహణలో భాగంగా విధులు నిర్వహిస్తుండగా పోల్ మీద నుంచి కిందపడిపోయాడు. దీంతో అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న సయ్యద్ అలీ సోమవారం ఉదయం మృతి చెందారు. మృతుడి సోదరుడు మహమ్మద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ రవికుమార్ దర్యాప్తు చేపట్టారు.

కార్పొరేటర్‌కు ఘన సత్కారం


అల్లు శంకరరావును సత్కరిస్తున్న 49వ వార్డు నాయకులు

మర్రిపాలెం: జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావును పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్‌గా బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయినింటి రవికుమార్ ఆధ్వర్యంలో బూత్ 38 పరిధిలోని నాయకులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శంకరరావు మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, మండల జనరల్ సెక్రటరీ ఆర్.చంద్రమౌళి, సోమేశ్వరాలయ ధర్మకర్తలతో పాటు మహిళా నాయకులు సరోజ, పూర్ణ, దుర్గ, పావని, వరలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కె.కె. రాజుకు వార్డు ప్రజల మద్దతు


అల్లు శంకరరావు ఆధ్వర్యంలో కె.కె.రాజుకు మద్దతు తెలుపుతున్న 49వ వార్డు ప్రజలు


ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుతో స్థానిక నాయకులు

మర్రిపాలెం: సార్వత్రిక ఎన్నికల తరుణంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె. రాజుకి 49వ వార్డు గ్రామ పెద్దలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, గ్రామ పెద్దలు బాపునాయుడు ఆధ్వర్యంలో ఎన్జీవోస్ కాలనీ పట్టాభిరెడ్డి తోట వద్ద ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో కె.కె. రాజు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఒక సామాన్యుడిగా అందరిలో మమేకమై, అందరి సమస్యలు తెలుసుకుని, నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించానన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఆదరించి, ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లంక భాస్కరరావు, చిరికి వెంకటరావు, పరదేశినాయుడు, చిరికి కొండలరావు, రాంబాబు, సూర్యనారాయణ, వెంకటరమణ, కర్రి చక్రధర్, ఆదిరెడ్డి శ్రీను, కిన్నెర ఆనంద్, వెంకటరావు, రమణ, లాలం వేణు, త్రినాథ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం..

సీతమ్మధార: ఎమ్మెల్యేగా కె.కె.రాజుని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో వెల్లడించారు. సోమవారం ఉత్తర నియోజకవర్గం ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అభ్యర్థి కె.కె.రాజుని సత్కరించారు. తమ ఎమ్మెల్యే కె.కె. రాజే అంటూ నినాదాలు చేశారు.

మూడేళ్లలో రూ.6 కోట్లతో అభివృద్ధి


సారిపిల్లి గోవింద్, 25వ వార్డు కార్పొరేటర్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో గడిచిన మూడేళ్లలో సుమారు రూ.6 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. కార్పొరేటర్‌గా బాధ్యతలు స్వీకరించి మూడేళ్లు పూర్తి అయిన సందర్భంగా వార్డులో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను ఆయన తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. బీటీఆర్ కాలనీలో రూ.1.36 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, 40 లక్షలతో మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో అదనపు అంతస్తు, రూ.16 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధి, హిందూ ముస్లిం కాలనీలో రూ.25 లక్షలతో సామాజిక భవనం నిర్మాణం చేపట్టామన్నారు. గ్రీన్‌బెల్ట్‌లో రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్, రూ.10 లక్షలతో వాకింగ్ ట్రాక్, రూ.70 లక్షలతో గురుద్వార నుంచి కాంప్లెక్స్ రోడ్ , మరో మూడు కోట్ల వ్యయంతో సీతంపేట, గొల్లవీధి, మధురానగర్, శాంతిపురం , రాజేంద్రనగర్, గణేష్‌నగర్, కనకమ్మవీధి ప్రాంతాలలో సీసీ, బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్లు నిర్మించడం జరిగిందన్నారు. మరో రెండు కోట్ల రూపాయల నిధులు వార్డు అభివృద్ధి కోసం మంజూరైనట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిశాక అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు.

అందరికీ అందుబాటులో బ్యాంకు సేవలు


ఖాతాదారులను సత్కరిస్తున్న బ్యాంకు అధికారులు

సీతమ్మధార : పేద, మధ్య తరగతి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా బ్యాంకును స్థాపించినట్లు కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు తెలిపారు. బ్యాంకు రజతోత్సవాల్లో భాగంగా కంచరపాలెం, సీతమ్మధార శాఖల ఆవరణలో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. బ్యాంకు స్థాపించి 24 ఏళ్లు గడిచాయని, ఇప్పటి వరకు వివిధ జిల్లా ల్లో 28 శాఖలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. 1707 మంది సభ్యులతో రూ.38.38 లక్షలతో కేవలం ఏడుగురు సిబ్బందితో బ్యాంకు ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం 17350 మంది సభ్యులతో రూ.33 కోట్ల వాటా నగదు పొంది రూ.1400 కోట్ల వ్యాపారంతో ముందంజలో ఉందన్నారు. బ్యాంకు వైస్ చైర్మన్ జి.రామకృష్ణ మాట్లాడుతూ సీతమ్మధారలో ఏర్పాటైన తమ బ్యాంకు శాఖ అందరి సహకారంతో ముందుకు సాగుతుందన్నారు. బ్యాంకు డైరెక్టర్ బి.నాగేశ్వరరావు, ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యాంకిశోర్, ఓఎస్‌డీ శాస్త్రి, సీతమ్మధార, కంచరపాలెం శాఖల మేనేజర్లు కె.విశ్వనాథం, దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

నాబా క్యాబేజీకి భలే గిరాకీ


రైతుబజారులో నాబా క్యాబేజీ విక్రయిస్తున్న రైతు పరమేశ్వరరావు

సీతమ్మధార : స్థానిక రైతుబజారులో లెట్యూస్ (నాబా క్యాబేజీ)కి భలే గిరాకీ దక్కింది. డుంబ్రిగూడ మండలం దేవుడువలస గ్రామానికి చెందిన రైతు పరమేశ్వరరావు సోమవారం రైతుబజారులో కిలో రూ.80 చొప్పున నాబా క్యాబేజీని విక్రయించాడు. దీనిని కూరగాను, సలాడ్ రూపంలోను చేసుకుని తింటారు. ఇది చక్కటి రుచితో పాటు ఆరోగ్యానికి కూడా మంచిదని వినియోగదారులు చెబుతున్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు
- పిల్లలతో పాటు తరలి వచ్చిన తల్లిదండ్రులు
- పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం


50వ వార్డు మాధవధార హైస్కూల్‌లో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు


ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ వద్ద విద్యార్థుల సందడి


పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు


మానసిక వికలాంగ విద్యార్థిని బయటికి తీసుకు వస్తున్న ఆశ వర్కర్లు

సీతంపేట: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభయ్యాయి. నియోజకవర్గంలో 8 జీవీఎంసీ, రెండు ఎయిడెడ్, 8 ప్రైవేట్.. మొత్తం 18 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరిగింది. తొలి రోజు తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు.

25, 26 వార్డుల్లో..

జీవీఎంసీ 25, 26 వార్డుల్లో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానిక మధురానగర్‌లోని జీవీఎంసీ హైస్కూల్, రాజేంద్రనగర్‌లోని వీటీ హైస్కూల్, అక్కయ్యపాలెంలోని జ్ఞాననికేతన్ హైస్కూల్, ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి వాతావరణం నెలకొంది. ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌కు కేటాయించిన 260 మంది విద్యార్థులకు గాను 258 మంది హాజరయ్యారు. జ్ఞాననికేతన్ హైస్కూల్లో 260 మందికి 260 మంది హాజరయ్యారు. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్లో 250 మందికి గాను 249 మంది హాజరయ్యారు.

జీవీఎంసీ 49, 50 వార్డుల్లో..

మర్రిపాలెం: జీవీఎంసీ 49, 50 వార్డుల్లో ఉన్న కేంద్రాల్లో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 49వ వార్డు ఏఎస్ఆర్‌నగర్‌లో ఉన్న జీవీఎంసీ హైస్కూల్లో 220 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సాయిలక్ష్మి తెలిపారు. 50వ వార్డు మాధవధార హైస్కూల్లో 194 మంది విద్యార్థులు, అలాగే సప్లిమెంటరీ (పరీక్ష తప్పినవారు) విద్యార్థులు 26 మంది హాజరయ్యారు. మొత్తం 220 మందిలో కొత్తగా రాస్తున్న వారు 194 మందిలో ఒకరు ఆబ్సెంట్ కాగా, సప్లిమెంటరీ విద్యార్థులు 26 మందిలో 10 మంది హాజరు కాలేదని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు హేమలత తెలిపారు.

జ్ఞానాపురం, కంచరపాలెం పరిధిలో..

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధిలోని సేక్రెడ్ హార్ట్ బాలికల పాఠశాల, ఏకేఎం జూబ్లీ, కంచరపాలెం పరిధిలోని రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాల, ఐటీఐ జంక్షన్ పరిధిలోని కప్పరాడ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు జరిగాయి. పరీక్షలకు విద్యార్థులు నిర్ణీత సమయానికి చేరుకున్నారు. ఆయా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సేవలందించారు. పరీక్షల నేపథ్యంలో కంచరపాలెం ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ ఇబ్బంది తప్పలేదు.

ఎస్ఎంసీహెచ్ హైస్కూల్లో..

సీతమ్మధార: సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ హైస్కూల్లో జరిగిన టెన్త్ పరీక్షలకు 220 మందికి గాను 216 మంది హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒక విద్యార్థి తెలియక సెల్‌ఫోన్ తీసుకు రావడంతో స్థానికుల వద్ద ఉంచి పరీక్షకు వెళ్లాడు. ఆదర్శ స్కూల్లో చదువుతున్న కార్తికేయ (మానసిక దివ్యాంగుడు) పరీక్ష రాసిన అనంతరం ఆశ వర్కర్లు అతన్ని తీసుకొచ్చి తండ్రికి అప్పగించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఉచిత, అత్యవసర మందులు, ఫస్ట్ ఎయిడ్ ఏర్పాటు చేశారు. ద్వారకా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మనస్తాపంతో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


మృతుడు భానుచైతన్య

సీతమ్మధార: సీతమ్మధార: మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... అక్కయ్యపాలెం, జగన్నాథపురంలో ఏయూ ఉద్యోగి శంకర శ్రీనివాస్ కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయన భార్య హైమావతి గవర్నమెంట్ టీచర్ కాగా, కుమారుడు భానుచైతన్య (20) ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం, కుమార్తె కళాశాలలో చదువుతున్నారు. భానుచైతన్య ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ఒక సబ్జెక్టు తప్పడంతో అప్పటి నుంచి మౌనంగా ఉండేవాడు. సోమవారం ఉదయం శంకర శ్రీనివాస్ విధులకు, హైమావతి పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్‌కు వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో భాను చైతన్య ఫ్యాన్‌కు ఉరి వేసుకుని, బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం మధ్యాహ్నం హైమావతి ఇంటికి వచ్చి చూడగా, భాను చైతన్య ఉరి వేసుకుని కనిపించాడు. ఇరుగు పొరుగు వారి సహాయంతో, కిందికి దించి పోలీసులకు సమాచారం అందించారు. ఫోర్త్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హెచ్‌సీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

బంగారం, వెండి ఆభరణాల చోరీ

మర్రిపాలెం : కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారం, వెండి ఆభరణాలు చోరీ జరిగిన ఘటన వెలుగుచూసింది. క్రైం పోలీసుల వివరాలిలా ఉన్నాయి.. ఈ నెల 17 రాత్రి కంచరపాలెంలోని ధర్మానగర్ శివాలయం వీధిలో నివసిస్తున్న పిల్లి శివలక్ష్మి విద్యుత్ బిల్లు చెల్లించలేదంటూ 16న లైన్‌మేన్ ఫ్యూజ్ తీసుకెళ్లిపోయాడు. ఆదివారం కూడా వారికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో రాత్రి సమీపంలో ఉన్న ఆమె అమ్మగారింటికి నిద్రపోవడానికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. వెంటనే కంచరపాలెం క్రైం పోలీసులకు సమాచారం అందించారు. క్రైం సీఐ ఎన్. శ్రీనివాస్ ఘటనాస్థలిని పరిశీలించారు. 7 తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు చోరీ అయ్యాయని బాధితురాలు శివలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.